క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్

నర్సాపూర్(జి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం, వంటగది, నిత్యావసర సరుకులను పరిశీలించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతున్నందున వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాస్టల్ వార్డెన్ కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

పంటలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్‌లో వ్యవసాయ పరిశోధన సంస్థ, ఏరువాక కేంద్రం ముధోల్ శాస్త్రవేత్తలు గురువారం వరి, సోయా,పత్తి పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు వచ్చే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దన్నారు. పంటవ్యర్థాలను కాల్చకుండా సేంద్రియ ఎరువులు తయారుచేసుకోవాలన్నారు. ఏఈవో లక్ష్మి, శాస్త్రవేత్తలు నర్సయ్య, విజయ్‌కుమార్, కార్తీక్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న టీవీటీఏ నాయకులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన నవీన్ కుటుంబానికి టీవీటీఏ(తెలంగాణ వొకేషనల్ ట్రైనర్స్ అసోసియేషన్) యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థికసాయం అందజేశారు. నవీన్ కుంటాలలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. గతనెల 27 రోడ్డు ప్రమాదానికి గురై చికిత్సపొందుతూ మృతిచెందాడు. టీవీటీఏ యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ. 70వేల నగదు అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్,సభ్యులు కనకం మహేశ్, శిరీష, సౌమ్య, రఘురెడ్డి, సాహిల్, ప్రశాంత్‌కిశోర్, సందీప్, సౌజన్య, సాయికృష్ణ ఉన్నారు.

కుభీర్‌లో గ్రామసభ

కుభీర్: మండల కేంద్రంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. భగీరథ నీరు సక్రమంగా రావడంలేదని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియట్లేదని గ్రామస్తులు సభా దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి సమయంలో దోమల బెడద, ఉక్కపోతతో ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని పేర్కొన్నారు. చేతి పంపులు మరమ్మతు చేపట్టాలని కోరారు. ఉపాధి కూలీల సంఖ్య ఎక్కువగా ఉన్నందున మరో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని తీర్మానించారు. కాగా, మిషన్‌భగీరథ, విద్యుత్ అధికారులు గైర్హాజరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏదైన సమస్య ఉంటే అధికారులకు ఫోన్ చేస్తే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గోవర్ధన్, తాజామాజీ మండల ఉపాధ్యక్షుడు మోయినొద్దీన్, తాజా మాజీ ఎంపీటీసీ పోసానిబాయి, ఈవో గోవర్ధన్, నాయకుడు అనిల్, కారోబార్లు ప్రకాశ్, బాబు ఉన్నారు.

జీలుగ సాగుపై అవగాహన

కుంటాల: రైతులు పచ్చిరొట్టె ఎరువుగా జీలుగను వరి వేసే ముందు వినియోగించుకోవచ్చని ఏఈవో గణేశ్ పేర్కొన్నారు. మండలంలోని విఠాపూర్ శివారులోని రైతులకు గురువారం జీలుగ సాగుపై అవగాహన కల్పించారు. జీలుగను 40 రోజుల వ్యవధిలో పూత వచ్చిన తర్వాత కలియదున్నాలని కోరారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

పంట వివరాలు నమోదు

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పరిధిలోని మొతక్‌పల్లి గ్రామంలో వానాకాలం పంట వివరాలను గురువారం క్లస్టర్ ఏఈవో రమ్య నమోదు చేశారు. రైతు పేరు, సర్వే నంబర్, ఎన్ని ఎకరాల్లో ఏ పంట వేశారనే తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. రైతులు అవధూత్, సాయన్న, తరుణ్ తదితరులు ఉన్నారు.

మురుగునీరు వెళ్లేదెలా?

- ఆలయాలకు వెళ్లేదారి బురదమయం
- రోడ్డుపై ఏర్పడిన గుంతలు
- భక్తులు, ప్రజలకు ఇబ్బందులు
- పట్టింపులేని అధికారులు

సారంగాపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో స్వర్ణ–నిర్మల్ ప్రధాన రహదారికి పక్కనే సాయిబాబా, వేంకటేశ్వరస్వామి, హనుమాన్ ఆలయాలు ఉన్నాయి. ఈ దారిలో మురుగునీరు నిలుస్తుండడం , ఆపై గుంతలు ఏర్పడి బురదమయం అవుతోంది. వర్షపు నీటితో ఈ ప్రధాన రహదారి నీటికుంటలా మారింది. కౌట్ల(బి) బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఇళ్ల మురుగునీరు వెళ్లేందుకు గతంలో మురుగుకాల్వ ఉండేది. కాలక్రమేణా అది పూడుకుపోయింది. మురుగునీరు రోడ్డుకు పక్కనే ఉన్న కచ్చా డ్రెయిన్ ద్వారా ప్రవహించి ఆలయ సమీపంలో గల ఖాళీస్థలాల్లోకి వెళ్లేది. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు. కొందరు గ్రామస్తులు ఇళ్లనిర్మాణ కోసం ఖాళీ స్థలాల్లో మొరం నింపడంతో మురుగునీరు రోడ్డుపై చేరుతోంది. అక్కడి నుంచి ఆలయాల ముందు నుంచే స్వర్ణప్రాజెక్టు కుడికాలువ పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్తోంది. అయితే భక్తులు మురుగునీరు దాటి ఆలయాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఇక రోడ్డుపై మురుగునీరు నిలిచి ఉండడం, గుంతల్లో వర్షపునీరు చేరడంతో అటు పాదాచారులు, ఇటు వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. జిల్లా రాజకీయాలను శాసించే స్థాయి నాయకులు గ్రామంలో ఉన్నా ఈ పరిస్థితి నెలకొందని మండల ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు.



చిన్న నీటి కుంటను తలపించేలా ఏర్పడ్డ గుంత



రోడ్డుపై గుంతలు

అప్పటి కలెక్టర్ ఆదేశించినా..

అప్పటి జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఈ దారిలో వెళ్తుండగా పరిశీలించారు. ఈ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. గుంతల్లో మట్టి వేయించారే తప్ప మురుగునీరు వెళ్లేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గుంతల్లో వర్షపు నీరు నిలిచి చిన్న నీటికుంటను తలపిస్తోంది. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. బురదలోంచి వెళ్లే పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనులు చేపట్టకపోవడంతోనే..

రోడ్డుకు రెండువైపులా మురుగుకాల్వ నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు నిధులు కేటాయించారు. పనులు మాత్రం ప్రారంభించ లేదు. ఆర్‌అండ్‌బీ రోడ్డును కొందరు ఆక్రమించుకున్నారని చెబితే నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాం. అయినా పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి ఉంది.

– తిరుపతిరెడ్డి, ఎంపీవో

రాథోడ్‌కు నివాళి



ఖానాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రాథోడ్ స్మారకార్థం గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాయకులు అంకం మహేందర్, నాయిని సంతోశ్, ఆకుల శ్రీనివాస్, టీకు ప్రకాశ్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

కడెంలో..

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో రాథోడ్ రమేశ్ చిత్రపటం వద్ద బీజేపీ నాయకులు, రాథోడ్ అభిమానులు నివాళులర్పించారు. నాయకులు ఆకుల లచ్చన్న, గాద్దు మనోజ్, రెంటం రాజేశ్వర్, కమ్మల స్వామి, మాదాసు రాజు, సుతారి రాకేశ్, సుతారి శంకర్, దొశెట్టి రాజన్న తదితరులు ఉన్నారు.

చుక్కల దుప్పిని కాపాడిన గ్రామస్తులు

కడెం: కుక్కలు దాడి చేసిన చుక్కల దుప్పిని గ్రామస్తులు కాపాడారు. మండలంలోని చిట్యాల్ శివారులోని ఆటవీ ప్రాంతంలో నుంచి వచ్చిన చుక్కల దుప్పిని గురువారం ఊరకుక్కలు వెంబడించడంతో గ్రామస్తులు కాపాడి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని దుప్పికి చికిత్సచేసి, సమీప ఆటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. గ్రామస్తులకు ఎఫ్ఆర్వో అనిత కృతజ్ఞతలు తెలిపారు.



గాయపడ్డ దుప్పి

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్: ఖానాపూర్ మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగ్గిల్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా పెద్ది నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా బట్టు వరుణ్, కోశాధికారిగా జంజిరాల రాజేశ్, ప్రచార కార్యదర్శిగా సతీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశ్, కోర్ కమిటీ అధ్యక్షుడిగా లవకుమార్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడి కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసకృష్ణ స్వామి, సీనియర్ ఫొటోగ్రాఫర్ గౌరికార్ రాజు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో సాయికుమార్, నవీన్, రాజు, నాగరాజు, సంజయ్, ఉమేశ్, రాజశేఖర్, రామ్‌లక్ష్మణ్, శే ఖర్, రాకేశ్ ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలి

నిర్మల్‌టౌన్: పారిశుధ్య నిర్వహణ పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ లైన్, శివాజీచౌక్, ఈద్గాం, శాస్త్రీనగర్, నటరాజ్‌నగర్ కాలనీల్లో మురుగునీటి నాలాలను గురువారం పరిశీలించారు. నాలాపై ఉన్న అక్రమ కట్టడాలు తొలగింపజేశారు. వర్షాకాలంలో గతంలో ముంపునకు గురైన జీఎన్ఆర్, వైఎస్ఆర్ కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట డీఈ జాదవ్ సంతోష్, టీపీవో సుమలత, ఏఈ హరిభువన్, కౌన్సిలర్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు ఉన్నారు.



మురుగునీటి నాలాను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

ప్రజలకు సేవ చేయడం అదృష్టం

- ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసారూరల్: ప్రజలకు సేవ చేయడం అదృష్టమని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీల పదవీకాలం ముగియడంతో భైంసా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లు ప్రజల్లో ఉండి ప్రజాసేవ చేయడం సంతోషమన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఎంపీపీ అబ్దుల్ రజాక్, జెడ్పీటీసీ సొలందీప, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజంహుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

ఎస్సైని కలిసిన బీజేపీ నేతలు



ఎస్సై గోపిని సన్మానిస్తున్న నాయకులు

సోన్: నూతన ఎస్సై గోపిని బీజేపీ మండల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాలు, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. నాయకులు జక్క రాజేశ్వర్, నడ్పి శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, గంగాధర్, ముత్కపల్లి సురేష్, దాసరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య వర్ధంతి

ఖానాపూర్: దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని కుర్మ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలో, తర్లపాడ్, కొత్తపేట్ గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరగొండ మల్లేశ్, దాసరికొండ మల్లయ్య, ఏనుగుల రాజేశ్వర్, పల్లా సాయన్న, పెద్ది మల్లేశ్, బైరి మల్లేశ్, జక్కుల బీరయ్య, జంగం రమేశ్, జక్కుల భూమన్న, బైరి రాజన్న, తదితరులు ఉన్నారు.

నేటి ధర్నా జయప్రదం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రప్రభుత్వం బొగ్గు గనుల వేలం రద్దు చేయడంతోపాటు బొగ్గు బ్లాకులు నేరుగా సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం వామపక్ష పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్షాల ఆధ్వర్యాన ఉదయం 11 గంటలకు చేపట్టే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు దుర్గం నూతన్ కుమార్, సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఎస్ఎన్‌రెడ్డి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న, నాయకులు చందుల సాయికిరణ్, వెస్లీ, గంగారం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

బాధ్యతల స్వీకరణ

లక్ష్మణచాంద/కుభీర్: ఎంపీపీ పదవీకాలం బుధవారంతో ముగియడంతో మండలాలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మోహన్‌సింగ్‌ను లక్ష్మణచాందకు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌ను కుభీర్ మండలానికి ప్రత్యేకాధికారులుగా నియమించింది. గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మనోహర్‌ను ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గోవర్ధన్, సూపరింటెండెంట్ నవనీత్‌కుమార్ తదితరులు పూలమాలలతో సత్కరించారు.



మోహన్‌సింగ్



మనోహర్‌ను సన్మానిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

నర్సాపూర్(జి): స్థానిక పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ గంగారెడ్డి గురువారం సందర్శించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై ఎస్సై హన్మాండ్లును అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలన్నారు. మండలంలో గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా స్టేషన్ పరిధిలో మొక్క నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. డీఎస్పీ వెంట నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై హన్మాండ్లు, కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

సంక్షిప్తంగా

షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి) సమీపంలో గల దుర్గాబాయి మహిళా ప్రాంగణంలో శిక్షణ తీసుకుంటున్న అంగన్‌వాడీ, ఎంపీహెచ్ డబ్ల్యూ మహిళలకు షీటీమ్ ఆధ్వర్యంలో పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. పీసీ రాధిక మాట్లాడుతూ మహిళలకు ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు కాల్ చేసి సమాచారమివ్వాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సిబ్బంది నళిని తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కుంటాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం కుంటాలలో ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. ఎఫ్ఏ రాజేశ్వర్, మాగాం దిలీప్ ఉన్నారు.

తానూరులో..

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో ఉపాధి హామీ ఏపీవో గంగాధర్ గురువారం మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. టీఏలు రమణాగౌడ్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్(జి): తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్‌కు మండల పంచాయతీ కార్యదర్శులు గురువారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీలకు కొన్ని నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తమపై ఆర్థిక భారం పడుతుందని వాపోయారు. గత కొన్ని నెలలుగా మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నామని పేర్కొన్నారు. ట్రాక్టర్ ఈఎంఐ, సీసీ చార్జీస్ చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యదర్శులు నరేశ్‌కుమార్, సాయికిరణ్, నవనీత్ కుమార్, వెంకటేశ్, శివకుమార్, కిరణ్‌కుమార్, రాజు, పద్మజ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కుంటాల: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వైద్యురాలు శృతిరెడ్డి పేర్కొన్నారు. కుంటాలలో గురువారం ఇంటింటా బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ఏఎన్ఎం సుచరిత, ఆశకార్యకర్తలు లక్ష్మి, దేవకి, విజయ, మమత ఉన్నారు.

రేపు రాజకీయ శిక్షణ తరగతులు

ఖానాపూర్: పట్టణంలోని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సీఎంరావు ఫంక్షన్ హాల్‌లో ఈనెల 6, 7 తేదీల్లో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నూతన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ పార్టీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఖానాపూర్: బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఉపాధ్యాయులు నరేందర్‌రావు, నరేందర్‌రెడ్డి, జాడి శ్రీనివాస్, అంజయ్య, శేఖర్, శంకర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పెంబిలో..

పెంబి: ట్రిపుల్ ఐటీలో మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాల చెందిన షాలిని, శివాణి, అర్చన, శ్రీలత సీట్లు సాధించారని హెచ్ఎం రాంచందర్ తెలిపారు. వీరిని గ్రామ నాయకులు గురువారం సన్మానించారు. గ్రామస్తులు, పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్: మండలంలోని మున్యాల్ జెడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు శ్రావణ్, జశ్వంత్, అలేఖ్య బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

ఆలయంలో సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాను దర్శించుకుని మొక్కు చెల్లించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

జెడ్పీటీసీకి సన్మానం

లక్ష్మణచాంద: జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం గురువారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీటీసీలకు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. లక్ష్మణచాంద జెడ్పీటీసీ రాజేశ్వర్‌ను మండల నాయకులు పూలమాలలు, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మండల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు క్రిష్టారెడ్డి, ఈటెల శ్రీనివాస్, సిరాజుద్దీన్, రాములు, బొమ్మెన రవి, భూమన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు గురువారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రూమ్ టు రీడ్ కార్యక్రమంలో భాగంగా వేసవి సెలవుల్లో లిటరసీ క్లౌడ్ యాప్ ద్వారా మండలంలోని పీచర పాఠశాలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ప్రతీరోజు ఈ యాప్ కథలను వాట్సాప్ ద్వారా షేర్ చేయడం, షేర్ చేసిన కథలను 32 మంది విద్యార్థులు చదివి అర్థం చేసుకుని ఆ కథలో ఉన్న బొమ్మలు, కథలను సొంతగా రాయడం, కథలో అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పారు. ఈ ప్రోగ్రాం వల్ల విద్యార్థుల పఠనా నైపుణ్యాన్ని పెంపొందించుకుని, సొంతంగా కథలు చెప్పడం, చిత్రలేఖనం గీయడం , చదవడం, రాయడం అలవాటు చేసుకున్నారు. 42 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విద్యార్థులను అభినందించడానికి గతంలో ఇక్కడ పనిచేసి ఇటీవల పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయురాలు హంసలత మండల నోడల్ అధికారి అశోక్‌వర్మతో 32 మందికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. రూం టు రీడ్ మండల కోఆర్డినేటర్ గోవర్ధన్‌నాయుడు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్, హెచ్ఎం గోదావరి, సీఆర్పీలు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సాగు భూమిలో గుడిసెలు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని గొండుగూడవాసులు గ్రామ సమీపంలోని రిలోకేషన్ వాసులకు కేటాయించిన సాగు భూమిలో గుడిసెలు వేశారు. పోడు సాగుచేస్తున్న భూములను రిలోకేషన్ పేరిట రాంపూర్, మైసంపేట్ వాసులకు కేటాయించడంతో ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవల సాగు భూమిలో గుడిసెలు వేసుకుని పనులు చేసుకుంటున్నారు. తహసీల్దార్ సుజాత గురువారం వారితో మాట్లాడిన వారు వినలేదు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎఫ్ఆర్వో అనిత, ఆటవీ సిబ్బంది, తదితరులున్నారు.



గొండుగూడవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

సారంగపూర్/ఖానాపూర్/ముథోల్: నీట్ పరీక్ష లీకేజీ నిరసనగా దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల పిలుపుతో గురువారం విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా సాగింది. సారంగపూర్, ఖానాపూర్, ముథోల్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బంద్ సంపూర్ణంగా పాటించాయి. నీట్ పరీక్షల్లో అక్రమాలు చోటు చేసుకుని నెలరోజులు కావస్తున్న ఇప్పటికి చర్యలు తీసుకోలేదని నాయకులు పేర్కొన్నారు. ఎస్ఎస్‌యూటీ మండల అధ్యక్షులు శశికుమార్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల నాయకులు ప్రవీణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ముథోల్: నిరసన తెలుపుతున్న ప్రతినిధులు